మిస్టరీ వీడేదెప్పుడో...



చుట్టుగుంటలో దారుణ హత్యకు గురైన వృద్ధురాలు



శివరామకృష్ణ ఇంట్లో బీభత్సం సృష్టించిన పారిపోయిన దుండగులు(ఫైల్)

- పట్టణంలో సంచలనం రేపిన దొంగతనం, హత్య కేసుల్లో వీడని మిస్టరీ
- సంచలన కేసుల్లో పురోగతి లేని వైనం

కందుకూరు: ఆరు నెలల క్రితం సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య, ఓ దొంగతనం కేసుల మిస్టరీ వీడడం లేదు. కేసుల దర్యాప్తులో పోలీస్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఈ కేసుల మిస్టరీ అంతుబట్టని రహస్యంగా మారింది. సంఘటనలు జరిగి ఆరు నెలలవుతున్నా కనీసం నిందితులను గుర్తించడంలో పోలీసులు ఘోరంగా విఫలమవుతున్నారు. దీంతో సంచలనం సృష్టించిన కేసుల వెనుక ఉన్న మిస్టరీ మిస్టరీగానే మిగిలిపోయింది.

వీడని వృద్ధురాలి హత్య మిస్టరీ

గత జనవరిలో మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంట గ్రామంలో ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలిని అత్యంత దారుణంగా హత్య చేశారు. మందలపు శేషమ్మ (67) అనే వృద్ధురాలు భర్త మరణించగా, కొడుకు ఉద్యోగరీత్యా విదేశాల్లో ఉంటున్నాడు. కుమార్తె పెళ్లి అయి హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో గ్రామంలో ఒంటరిగా ఉంటున్న శేషమ్మను గుర్తు తెలియని దుండగలు గొంతులో కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశారు. రెండు రోజుల పాటు శేషమ్మ ఇంట్లోంచి బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి పరిశీలించగా హత్యకు గురై కనిపించింది. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనంగా మారింది. వృద్ధురాలిని చంపాల్సిన అవసరం ఎవరికి ఉందనేది అంతుపట్టని రహస్యంగా మారింది. దొంగలు పని అని అనుమానిద్దామంటూ ఇంట్లో ఎటువంటి దొంగతనం జరగలేదని అప్పట్లో పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ సంఘటనపై కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అప్పటి పోలీస్ ఉన్నతాధికారులు కేసు దర్యాప్తు అప్పటి నెల్లూరు డీఎస్పీకి అప్పగించారు. కానీ ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటి వరకు వృద్ధురాలి మిస్టరీ వెనుక ఉన్న మిస్టరీని పోలీసులు చేధించలేకపోయారు.

☛ రెండు నెలల క్రితం పట్టణంలో ఉప్పుచెరువులో కిశోర్ అనే యువకుడి మృతదేహం లభించింది. కిశోర్ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో కిశోర్ మృతిపై కుటుంబ సభ్యులతో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కిశోర్ మృతి కేసు నమోదు చేసిన పోలీసులు రెండు నెలల నుంచి వాస్తవాలను చెప్పడంలో విఫలం అవుతున్నారు. అలాగే ఇటీవల కృష్ణారెడ్డి అనే వైఎస్సార్‌సీపీ నాయకుడి టీ కొట్టును గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. దీనిపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. ఈ కేసులో కూడా చేధించడంలో పోలీసులు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది.

ఇలా కందుకూరు ప్రాంతంలో జరుగుతున్న హత్యలు, దొంగతనాల కేసులకు సంబంధించిన కేసుల దర్యాప్తులో పోలీస్ అధికారుల నిర్లక్ష్యం కొట్టినట్లు కనిపిస్తుంది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సంచలనం సృష్టించిన కేసుల వెనుక దాగి ఉన్న మిస్టరీని చేధించాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఒకే ఇంట్లో రెండు సార్లు..

పట్టణ నడిబొడ్డున పగలు, రాత్రీ తేడా లేకుండా నిత్యం జనసంచారం ఉండే కనిగిరిరోడ్డులో గత మార్చి 16వ తేదీ రాత్రి జరిగిన సంఘటన ఓ సంచలనమే. కనిగిరి రోడ్డులో నివాసం ఉండే పాన్ షాపు వ్యాపారి శివరామకృష్ణ, విసీల దంపతుల ఇంట్లోకి అర్ధరాత్రి 2.30గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. బంగారం, నగలు ఇవ్వాలంటూ ఆ దంపతులపై దాడి చేయడమే కాకుండగా, వారి కుమారుడు మోక్షజ్ఞను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. ఇంట్లో దాదాపు తెల్లవారు జాము 4.30 గంటల వరకు ఉన్న దుండగలు నానా హంగామా సృష్టించి, దంపతులను తీవ్రంగా గాయపరిచి దొరికినకాడికి నగదుతో ఉడాయించారు. నిత్యం జనసంచారం ఉండే కనిగిరి రోడ్డులో ఈ సంఘటన జరగడం అప్పట్లో సంచలనంగా మారింది. మరుసటి రోజు ఉదయం పోలీస్ ఉన్నతాధికారులు, క్లూస్ టీం వంటి సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించడంతో పాటు, బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. ఇదంతా ఒక ఎత్తయితే సంఘటన జరిగిన రెండు రోజుల తరువాత పట్టపగలు ఉదయం 10 గంటల సమయంలో అదే ఇంటికి వచ్చిన దుండగలు మరోసారి ఆ దంపతులను బెదిరించి దాడి చేసి వెళ్లడం విశేషం. ఆ



శివరామకృష్ణ దంపతుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు(ఫైల్)

సమయంలో పారిపోతున్న దుండగలను స్థానికులు ఫొటోలు తీసి పోలీసులకు ఇచ్చారు. కానీ ఈ కేసును పోలీస్ అధికారులు ఇంత వరకు చేధించలేకపోయారు. ఒకే ఇంటికి రెండు రోజుల వ్యవధిలో వచ్చి బెదిరించడం, దాడి చేయడం వంటి సంఘటనలు అప్పట్లో పలు అనుమానాలకు తావిచ్చాయి. సంఘటనకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నా నేటి వరకు వారిని పోలీసులు పట్టుకోలేక పోయారు. అయితే ఈ సంఘటన ఖచ్చితంగా సాధారణ ఎన్నికల హడావుడి సమయంలో జరగడంతో కేసుపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం, ఇదే అదునుగా దుండగలు రాష్ట్రం విడిచి వెళ్లిపోయారని అప్పట్లో పోలీసులు గుర్తించారు. ఆ తరువాతైనా ఈ కేసుపై దృష్టి పెట్టని పోలీసులు ఈ సంఘటన వెనుక దాగి ఉన్న వాస్తవాలను ఏంటో గుట్టువిప్పలేకపోతున్నారు.

సోదర ప్రేమకు ప్రతీక రక్షా బంధన్



దద్దాల నారాయణకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలుపుతున్న సోదరీమణులు



ఐకిడ్స్‌లో జరిగిన రాఖీ వేడుకల్లో చిన్నారులు

కనిగిరి రూరల్: సోదర ప్రేమకు ప్రతీకగా.. అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అప్యాయత అనురాగాలకు, అనుబంధం, దీవెనలకు దర్పణంగా నిలిచే రాఖీ(రక్షాబంధన్) వేడుకలను కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణకు పలువురు పార్టీకి చెందిన మహిళలు, కుటుంబ సభ్యులు రాఖీ కట్టి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం దద్దాల నారాయణ యాదవ్‌కు అతని సోదరీమణులు దద్దాల పుష్ప కుమారి, దద్దాల వరకుమారి, దద్దాల వరలక్ష్మీలు దద్దాల శ్రీదేవి, దద్దాల శ్రీలేఖలు రక్షా బంధన్ కట్టారు. అలాగే వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు నాగమణి, షకీల, సుస్మితాలు దద్దాల నారాయణకు రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు. వెలిగండ్లలో నాగిరెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు రెడ్డి దద్దాల నారాయణకు రాఖీ కట్టారు. పామూరుకు చెందిన వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు పద్మ, సుహాసినీలు దద్దాల నారాయణకు రక్షా బంధన్ కట్టి, ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



దద్దాలకు రాఖీ శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ మహిళలు

సర్వర్ డౌన్.. అధికారులు నిల్



టంగుటూరు రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్ వద్ద అధికారులు లేని దృశ్యం



మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఖాళీగా సింగరాయకొండ రెవెన్యూ కార్యాలయం

- తూతూ మంత్రంగా మీ కోసం కార్యక్రమం

సింగరాయకొండ: మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు సమస్యలు తప్పడం లేదు. ప్రతి వారం ఒకరిద్దరు అధికారులతో మమ అనిపిస్తున్నారు. ఈ వారం సర్వర్ డౌన్ కావడంతో జిల్లాలోని ఒక్క మండలంలో కూడా వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించలేదు. దీంతో నేరుగా లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించి కార్యక్రమం ముగించాలని ఉన్నతాధికారులు సూచించారు. మీ కోసంలో అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని శాఖల అధికారులు పాల్గొనాలి. ఈ వారం తొమ్మిది శాఖల అధికారులు పాల్గొన్నప్పటికీ, కొంతమంది అధికారులు మధ్యాహ్నం 11.30 గంటలకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ఉండటంతో వెళ్లారు. రెవెన్యూ అధికారులు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆర్‌డీఓతో సమావేశానికి హాజరయ్యారు. దీంతో మిగిలిన శాఖల అధికారులు ఇక మనమెందుకులే అని అందరూ జారుకున్నారు. మొత్తం మీద మీకోసం కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోందే తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై ఎవరికీ శ్రద్ధ లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వాస్తవానికి మీకోసం కార్యక్రమం జరిగే సమయంలో కొన్ని శాఖల అధికారులతో ఏవిధంగా సమీక్షలు పెడతారని ప్రశ్నిస్తున్నారు. మీ కోసం కార్యక్రమం సక్రమంగా నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మీ కోసం కార్యక్రమంలో పలువురు అర్జీలు అందజేశారు. ఊళ్లపాలెం పంచాయతీలో కోదండరామస్వామి దేవస్థానం భూములు 42 ఎకరాలు కొత్తపట్నం మండలం అల్లూరు, ఊళ్లపాలెం గ్రామాల్లో అన్యాక్రాంతమయ్యాయని వాటిని పరిరక్షించాలని అర్జీ ఇచ్చారు. పాకలకు చెందిన రైతు తన పొలం 15 సెంట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ ఇచ్చారు.

కొండపిలో కేవలం ఒక అర్జీ

కొండపి(సింగరాయకొండ): మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి ఒక అర్జీ మాత్రమే వచ్చింది. పాస్ బుక్ కోసం ఒక అర్జీ మాత్రమే వచ్చిందని ఇన్చార్జి తహసిల్దార్ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టంగుటూరు విద్యార్థినికి సైనిక్ స్కూల్లో ప్రవేశం



లాస్యప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చల్లాపల్లి లాస్యప్రియ ఇటీవల నిర్వహించిన సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో ప్రతిభ చాటింది. జమ్మూ కశ్మీర్‌లోని నగ్రోటా సైనిక్ స్కూల్లో అడ్మిషన్ సాధించిన సందర్భంగా పాఠశాలలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు తులసి ప్రభ మాట్లాడుతూ.. విద్యార్థులు అందరూ లాస్యప్రియను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. లాస్యప్రియను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కనిగిరి రూరల్: పట్టణంలోని కొన్ని ఏరియాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కందుకూరు రోడ్డులో టవర్ వర్కులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈమేరకు పట్టణంలోని కపిలా లాడ్జి, ఎంఈఓ ఆఫీసు వెనుక వీధులు, పవిత్ర కల్యాణమండపం ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివ్యాంగ పిల్లలకు ఉచిత బస్ పాస్‌లు



రాఖీలు కట్టిస్తున్న సంస్థ సభ్యులు

గుడ్లూరు (కందుకూరు రూరల్): ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగ పిల్లలకు అఖిల భారత సక్షమ్ సేవా సంస్థ ద్వార ఉచిత బస్ పాస్‌లు, ఐడీ కార్డులు అందజేస్తామని సంస్థ డివిజన్ కన్వీనర్ వేణుగోపాల్‌రావు తెలిపారు. గుడ్లూరు మెయిన్ పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల దివ్యాంగ చిన్నారుల కేంద్రంలో అఖిలభారత సక్షమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో బాలికల చేత విద్యార్థులకు సంస్థ కమిటీ సభ్యులు రాఖీలు కట్టించారు. చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

నూతన బోధనా పద్ధతులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంఈఓ పెద్దిరాజు

హనుమంతునిపాడు: సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులకు మంచి అవగాహన ఉండాలని ఎంఈఓ పెద్దిరాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో సోమవారం అరు మండలాల ఫిజిక్స్ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ పెద్దిరాజు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో నూతన బోధన పద్ధతులపై ఉపాధ్యాయులు ముందుగా తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో బోధన అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృ షి చేయాలని కోరారు. కాంప్లెక్స్ చైర్మన్ బొప్పరాజు సుబ్బారావు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలేజీలో మధ్యాహ్న భోజనం



కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతుల రామారావు సోమవారం ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చిడిపోతు వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకటసుబ్బయ్య, కారుమంచి సుబ్బారావు, ప్రిన్సిపాల్ చక్రపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

70 మద్యం సీసాలు పట్టివేత

గుడ్లూరు (కందుకూరు రూరల్): అక్రమంగా తరలిస్తున్న 70 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుడ్లూరుకు చెందిన ఎం.అనిల్ అనే వ్యక్తి చెమిడిదిపాడు గ్రామం సమీపంలో మద్యం సీసాలు తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ


వెలిగండ్ల: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సోమవారం మండలంలోని జరిగిన వివాహ వేడుకల్లో, పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. ఇమ్మడి చెరువు గ్రామంలో సర్పంచ్ తోకల బాలయ్య మనవడు గంగరాజు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, మేకల నాగూర్ యాదవ్, కాకర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు రిబ్కా కటికట వెంకటరత్నం, స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, తాతపుడి సురేష్, జేమ్స్ గొబ్బిళ్ల శ్రీను, నాని,గంజీ రవీంద్రారెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు. కంద్రిక గ్రామంలో ఎగిటి వారి ఇంట జరిగిన శుభకార్యంలో దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఆయన్ను స్థానికులు సన్మానించారు.



వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

కనిగిరి రూరల్: పట్టణంలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ అధికారులతో కలిసి కొండపై ఉన్న పాత వాటర్ ట్యాంక్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో కనిగిరి ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు. దీంతో అనేక బోర్లల్లో నీటి మట్టం పడిపోయి నీటి సమస్య నెలకొందని చెప్పారు. గతంలో డంపింగ్ యార్డ్ ప్రాంతంలో ఉన్న డీప్ బోర్ వెల్‌తో కొండపైన ఉన్న ట్యాంక్‌కు నీటిని ఎక్కించి పట్టణంలోని 17,18,19 వార్డులకు నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం బోర్లలో నీటి మట్టం పడిపోవడంతో నీరు పైకి ఎక్కడం లేదని చెప్పారు. తక్షణ చర్యగా డంపింగ్ యార్డు ప్రాంతంలోని మరో ఏరియాలో కొత్త బోరును ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే పట్టణంలో నీటి ఎద్దడి ఉన్న వార్డులను, ఏరియాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పసుపులేటి అరుణోదర్, ఏఈ కోటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ ఏరియాను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

పొగాకు అక్రమ కొనుగోళ్లు వద్దు

టంగుటూరు: పొగాకు అక్రమ కొనుగోళ్లు, విక్రయాలు చేయవద్దని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పొగాకు బేళ్ల అక్రమ తరలింపుపై సమాచారం ఉంటే బోర్డు అధికారులకు తెలియజేయాలని కోరారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు వేలానికి 891 బేళ్లు ఉంచగా 758 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.306.70 పలికింది. వేలంలో మొత్తం 46 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపిలో 998 బేళ్లు కొనుగోలు

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 998 బేళ్లు కొనుగోలైనట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రపడియ, నెన్నూరుపాడు గ్రామాల రైతులు 1195 బేళ్లు వేలానికి ఉంచగా 998 కొనుగోలయ్యాయి. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.306.41 పలికింది. వేలంలో 15 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డులో స్వచ్ఛభారత్

కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పొగాకు బోర్డు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్

నిందితులను కఠినంగా శిక్షించాలి



రాస్తారోకోలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి సయ్యద్ షమ్మి

పామూరు: మహిళలపై లైంగిక దాడులు, హత్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సయ్యద్ షమ్మి అన్నారు. పశ్చిమ బెంగాల్లోని కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనలో బాధ్యులను గుర్తించి వారిని ఉరితీయాలని డిమాండ్‌చేస్తూ సోమవారం మూరులోని కనిగిరి బస్టాండ్‌లో ఐద్వా ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ, మానవ హారం చేపట్టారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి షమ్మి మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకే దేశంలో రక్షణ కరువైందన్నారు. జూనియర్ డాక్టర్‌ను దుర్మార్గంగా హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించకుండా వారికి మద్దతు తెలిపిన వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే.మాల్యాద్రి, జేవీవీ నాయకులు కాశి శంకర్, ఐద్వా మండల అధ్యక్షురాలు భానుమతి, మదారమ్మ, షేఖ.ఖాదరున్నీసా, మస్తాన్‌బి, రమణయ్య పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయాలి

కొండపి(సింగరాయకొండ): విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకడమిక్ అధికారి ఎం.రమేష్ పేర్కొన్నారు. కొండపి మండలం కె.ఉప్పలపాడు జెడ్పీహెచ్‌ఎస్లో సోమవారం నిర్వహించిన ప్రైమరీ, సెకండరీ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను ఏ విధంగా మెరుగుపరచాలో ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కొండపి ఎంఈఓ-2 పి. రామారావు, కాంప్లెక్స్ చైర్మన్ వి.సూసన్నకుమార్ పాల్గొన్నారు.



కొండపి హైస్కూల్లో విద్యార్థులకు సూచనలిస్తున్న అధికారి రమేష్

పాఠశాల తనిఖీ

కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా అకడమిక్ అధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని పీ.ఏ ఎల్ ల్యాబ్ సక్రమంగా వినియోగిస్తే విద్యార్థుల్లో స్వీయ అభ్యసనం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-1 బి.నాగేంద్రవదన్ సూచించారు. జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల ప్రైమరీ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు మత్రి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ పెంచాలి

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్స్ పెంచేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్, మండలంలోని డి.జి.పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణల్లో ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యుల సహకారంతో కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయన్నారు. శ్రమదానం కింద మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 20వ తేదీ మంగళవారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు వేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఈ నెల 27వ తేదీ నుంచి ఫార్మాటివ్ పరీక్షలు నిర్వహించాలని, సిలబస్ పూర్తిచేసి విద్యార్థులకు తర్ఫీదునివ్వాలని కోరారు. విద్యాప్రవేశ్ 90 రోజుల కార్యక్రమాన్ని పాఠశాలల్లో అమలుచేయాలని, లెసన్‌ప్లాన్లు తయారుచేసుకోవాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు. కాంప్లెక్స్ చైర్మన్‌లు షేక్.ఖాదరున్నీసాబేగం, జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సీఎఆర్‌పిలు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరాల్లో మాట్లాడుతున్న ఎంఈఓ కొండారెడ్డి

శ్రీనివాసులుకు రూ.10 వేల ఆర్థికసాయం

కనిగిరి రూరల్: రామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని దిరిశవంచ గ్రామానికి చెందిన కొంపల శ్రీనివాసులుకు రూ.10 వేల ఆర్థిక సాయం సోమవారం అందించారు. శ్రీనివాసులు గుండె ఆపరేషన్ చేయించుకొని అనారోగ్యంతో, ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో రామకృష్ణా సేవా సమితి సభ్యులు కె.శ్రీనివాసులుకు చేయూత నందించారు. సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పైడి మత్రి శ్రీరాములు, తానిగుండాల యర్రారెడ్డి, ఉపాధ్యక్షులు శేగు శ్రీనివాసులు, కోశాధికారి కందుకూరి శారదా ప్రసాద్, విశ్వనాధుని వంశీ, దిరిశవంచ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న రామకృష్ణా సేవా సమితి కమిటీ